# దూరం

'స్మిత'




రాజారావ్ అంత తొందరగా ఇంటికి వస్తాడని ఎవరూ అనుకోలేదు అందుకే ఇంట్లో అతని ప్రమేయంలేకుండా జరిగే కార్యక్రమాలు యధావిధిగా జరిగిపోతున్నాయి

రాజారావ్ ఇంట్లో అడుగుపెట్టేసరికి సంగీత గదిలోంచి గజ్జెల శబ్దం వినిపించింది "పాప డాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నట్టుంది" అనుకున్నాడు అలా అనుకునేసరికి గుర్తొచ్చింది — పాప డాన్స్‌చూసి చాలా రోజులు ఛ ఛ చాలా సంవత్సరాలైందని, కనీసం స్కూల్ ఫంక్షన్స్‌కిగాని — కాలేజి ఫంక్షన్స్‌కిగాని అటెండ్ అవలేదని

మనసు గిల్టీగా ఫీలైంది నెమ్మదిగా కర్టెన్ తొలగించి చూసాడు — వీధి తలుపు వైపుంచి టేప్ రికార్డర్‌లో వస్తున్న తాళాని కనుగుణంగా డాన్స్ చేస్తోంది సంగీత

శబ్దం కాకుండా వెనక్కు తిరిగాడు శ్రీను గది తలుపులు బార్లా తీసి వున్నాయి చుట్టూ పుస్తకాల మధ్య బయటి ప్రపంచంతో సంబంధం లేనట్లుగా — లీనమై వున్నాడు మెడిసిన్ సెకండియర్ చదువుతున్న కొడుకు డిస్టర్బ్ చెయ్యలేక వెనక్కు తిరిగాడు

బెడ్‌రూమ్‌లోకి అడుగు పెట్టిన రాజారావ్ మరో ప్రపంచంలోకి వచ్చినట్లు — దిమ్మెర పోయాడు

డిమ్‌లైట్‌లో నీలంగా మెరుస్తోంది గది

చాలా మంద్రంగా వినిపిస్తోంది—చిట్టిబాబు వీణ కళ్లు డిమ్‌లైట్‌కి అలవాటు పడ్డాక గాని గమనించలేదు— ఈజీ చెయిర్‌లో వెనక్కివాలి వున్న సుజాతని

సుజాతని చూడగానే అప్రయత్నంగానే అడుగు వెనక్కు పడింది

చేతిలో కర్టెన్ జారిపోయింది

కర్టెన్ కిందంచున ఉన్న గజ్జెలు ఘల్లుమన్నాయి ఉలిక్కిపడి తలెత్తింది సుజాత

"మీరా ?"

రాజారావ్ లోపలికి వెళ్ళాడు

ట్యూబ్‌లైట్ గుప్పున వెలిగింది

సుజాత కళ్లు తడిసిన మందారాల్లా చప్పున లేచి వంటగదిలోకి వెళ్లింది సుజాత

రాజారావ్ కళ్లు అప్రయత్నంగానే గదిని వెతికాయి

గోడల మీద అక్కడక్కడ పెయింటింగ్స్— సుజాత వేసినవే

ఏదో సన్నటి వాసన చాలా సేపటికి గాని గమనించలేదు ఆ వాసన మంచి గంధంతో చేసిన వేలెండంత రాధాకృష్ణుల బొమ్మదని

సుజాత కాఫీ పట్టుకు రావడంతో తల తిప్పాడు ప్రయత్న పూర్వకంగా పెదవుల మీదకు చిర్నవు తెచ్చుకున్నాడు

"ఇంకా ఆరైనా అవలేదు అప్పుడే చీకటి పడిపోయింది" కాఫీ అందుకుంటూ అన్నాడు రాజారావ్

"శీతాకాలం గదా" జవాబుగా అంది సుజాత

అప్రయత్నంగా సుజాత పెదవులమీద చిన్న చిర్నవ్వు ఇరవై సంవత్సరాల క్రిందటి జ్ఞాపకాలు కదిలాయి పెళ్ళైన కొత్తలో —

సరిగ్గా ఇవే మాటలు ఆ తరువాత—

"మరింకేం తలుపులు వేసెయ్ — ఎవరు తలుపు కొట్టినా మళ్ళీ రేప్పొద్దుటి వరకు తియ్యద్దు" అనేవాడు

రాజారావ్ కళ్ళలో ఆ జ్ఞాపకాల కోసం వ్యర్థంగా వెతుక్కుంది సుజాత

"ఇంకా టైముంది పిక్చర్‌కి వెళ్దామా ?"

"ఇప్పుడా పాపకి ఎల్లుండి డాన్స్ కాంపిటీషన్ బాబుకి నాలుగురోజుల్లో ఎగ్జామ్స్ "

రాజారావ్ అసహనంగా తల విదిలించాడు

"పోనీ మనిద్దరం వెళ్దాం "

"ఆ అన్నీ చెత్త సినిమాలు ఏం చూస్తాం" పెదవి విరిచింది సుజాత

రాజారావ్ విసురుగా లేచి నిల్చున్నాడు

"అవును ఎందుకొస్తావ్ ? అసలు నాతో సినిమాకి రావటం ఇష్టం లేదనరాదూ — మీ లోకం మీది నాతో పనేమిటి " సుజాత ఏదో చెప్పబోయేలోగానే బయటకు వెళ్ళిపోయాడు

రెండు నిమిషాల్లో స్కూటర్ స్టార్టయింది

* * *

సెకండ్ షో సినిమా చూసి — ఇంటికి వచ్చాడు రాజారావ్ కాలింగ్ బెల్ వింటూనే ఇంకా చదువుకుంటున్న శ్రీను వచ్చి తలుపు తీసాడు

"ఇంకా పడుకోలేదా ? చాలా లేటైంది పడుకో పొద్దున లేచి చదువుదువుగాని "

గీజర్లో వేణ్ణీళ్ళతో స్నానం ముగించి — డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చాడు

ఆకలి — విపరీతమైన ఆకలిగా వుంది

బోర్లించిపెట్టిన కంచం తీసాడు

దానికింద ఓ కాగితం నాలుగు మడతలతో కంచం పక్కనుంచేసి కాగితం అందుకున్నాడు

# దూరం

ప్రియమైన ఆర్ (రౌడీ)కి —

బహూశా ఈ పిలుపైనా మీలో సమాధి అయిపోయిన జ్ఞాపకాల్ని తట్టి లేపుతుందా — గుర్తు చెయ్యనా — పెళ్ళి కాకముందు — నా ఇనీషియల్ డి అంటే దేవత అని మీరు వ్రాసినప్పుడు మీ ఇనీషియల్ ఆర్ కి — రౌడీ అని చెప్పానని — చాలా ఏళ్ళు మీకు ఉత్తరం అంటూ వ్రాస్తే అలాగే వ్రాసేదాన్ననీ —

సాంప్రదాయాల్ని కాదని—తల్లిదండ్రుల్ని కాదని — చివరికి సంఘం కట్టుబాట్లైన కులమతాల్ని కాదని — మీకోసం కట్టుబట్టల్తో వచ్చేసాను — అందుకోసం ఏ రోజూ బాధపడలేదు శ్రీవారూ – కాని నేను చేసిందేమిటి —

నా ఆశల్ని — నా ఆశయాల్ని — నా కలల్ని అన్నీ మీ చుట్టూనే అల్లుకున్నాను

చివరికి మీ వునికే నా వూపిరి అనుకున్నాను కాని ఏ రోజూ అనుకోలేదు— నా కలల్ని— నన్ను ఒక్క తోపుతోసి మీ లోకం మీరు ఏర్పరచుకుంటారని నిజమే— మీకు నేనూ, నాకు మీరూ కావాలనుకోవడం వల్ల మా వాళ్లకు మీరూ మీ వాళ్ళకు నేనూ పనికిరాని వాళ్ళ మయామ అన్ని పరిణామాలూ ఆలోచించే కదా మనం ఒకరికొకరం కావాలనుకున్నది నిజమే మీలాగే నేనూ ఎదురుచూసాను కనీసం పిల్లల్ని చూసైనా మారకపోతారా అని కాని పెద్దవాళ్ళకు కావలసింది — డబ్బూ— సాంప్రదాయాలే కాని మనసులూ— మనుషులూ కాదని తెలిసి వచ్చింది

అంతమాత్రాన అంత బాధపడి మిమ్మల్ని మీరు మరచిపోవాలని ప్రయత్నించాలా —

ఆ ప్రయత్నంలో ఒక్కక్షణం— నా గురించి ఆలోచించారా — మీలాగే — మీరే ఆధారంగా — మరో ప్రాణి వుందనైనా గమనించారా ? కనీసం పిల్లలనైనా చేరదీసారా ? నాకు నేను ఎంత తల్లడిల్లిపోయానో ఏం తెలుసు మీకు ? కనీసం ఆలోచనల్ని తప్పుకుందుకు ఏ చెత్త సినిమా అయినా చూడాలనుకున్నరోజున మీరు ఎన్ని గంటలకు యింటికి వచ్చేవారు — గత పదేళ్ళుగా మీ టైమ్స్ ఫిక్స్‌డ్ అయిపోయాయి పొద్దున తొమ్మిదింటికి భోజనంచేసి వెళ్తే రాత్రి క్లబ్‌కివెళ్ళి తిరిగి వచ్చేది రెండు గంటలకు ఆ మగతలో ఆ మత్తులో మీకోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూసే నేనున్నానని మీకసలు గుర్తుండేదా ? మళ్ళీ పొద్దున ఎనిమిదింటికి నిద్రలేస్తే తొమ్మిదింటికి వెళ్ళిపోవడం —

ఇదేనా నేను మీనించి ఆశించినది ? దీని కోసమేనా మీరు తప్ప మిగతా వారినందరినీ త్యజించినదీ —

ఏదైనా అడిగితే విసుగూ — పోట్లాట — మనసు విరిగిపోవడం — అంతేకాని మరేదైనా ఫలితం దక్కిందా ?

మీ మాటల్లో—మీరన్నట్టుగా—మీ జీవితంలో నేనుతప్ప మరెవరూ లేరు—ఉండరు వచ్చే జీతం తెచ్చి నా మొహాన్న పారేస్తున్నారు

కాని శ్రీవారూ—మీ మనసుకు తెలియదా ? మీ ఉద్యోగాన్ని చూసి నేను ప్రేమించలేదు — మీరు తెచ్చి పారేసే జీతం రాళ్ళు నేను సంపాదించుకోలేనా ?

నేను చాలా అల్ప సంతోషిని నావి చాలా చిన్న కోరికలు కాని అవికూడా తీర్చుకోలేక పోతున్నాను ప్చ్ దురదృష్టం పెళ్ళికాక ముందు ఆ అర్నెల్లూ సినిమాకు వెళ్దామనీ — షికార్లకెళ్దామనీ వేధించేవారు గుర్తుందా

నేను కూడా ఆశించాను పెళ్ళైనాక బయటకంటూ వెడితే మీ తోటే వెళ్లాలని, సినిమా చూస్తే మీతోటే చూడాలనీ, గుడికి వెళ్తే మీరూ—నేనే వెళ్ళాలనీ—

## ఆదర్శం

చిన్నా పెద్ద
ధనిక బీద
ఆడ మగ
దొంగ దొర
ఎవరొచ్చినా
చేతులు చాపి
స్వాగతం పలికి
నీడ నిస్తున్న
చెట్టు — చేమా
జీవితాలు
సమానత్వానికి
ప్రత్యక్ష నిదర్శనాలు

— మాధవరపు కృష్ణ

ఇవన్నీ, అనుక్షణం మీరు నా పక్కన, నాతో నా మనసుతో ఒకట్టై పోవాలనే

మీకు తెలుసా — కనీసం ఈ ఇరవై రెండేళ్ళలోనైనా గ్రహించగలిగారా— మంచినీళ్ల తాగినా మీతోపాటే తాగాలని నా మనసు కోరుకుంటుందని—

సాయంత్రం మీరు వచ్చాకే ఇద్దరం టీ తాగేవాళ్లం ఆ సంగతి మీకూ తెలుసు అయినా మీ అలవాట్లు మారి మీ కోసం చూసి చూసి ఆ అలవాటు మానేసుకున్నానని తెలుసా ? ఎప్పుడైనా అడిగారా? రాత్రి ఏకంగా రెండింటికి వచ్చి భోజనం చెయ్యలేదని కోపగించుకునేవారే గాని— నా కోసం ముందు ఇంటికి రాగలిగారా ?

''తింటే తిను లేకపోతే లేదు'' అని మీరేనా అనగలిగింది ? పదేళ్లుగా రాత్రి భోజనం మానేసానని తెలుసా మీకు

సారీ ! ఆవేశపడి పోతున్నానా ఊహ ఆవేశపడి రాత్రంతా నిద్ర మాని బ్లడ్‌ప్రెషర్ రైజయిన రోజులన్నీ గడిచిపోయాయి

చాలా రోజులు నన్ను నేను ఎనలైజ్ చేసుకుని మరీ ఆలోచించాను బహూశా నా చుట్టూ మిమ్మల్ని (పెళ్ళి కాకముందు రెండేళ్ళు) తిప్పుకున్న లక్షణమేదో నాలో హరించి పోయిందేమోనని (ప్రతి క్షణం ప్రతి నిమిషం నా గురించే మీ ఆలోచనలని మీరు వ్రాసుకున్న డైరీ భద్రంగా తెలియజెప్పింది )

మీరంటూ వుంటే నాకోసమేననికూడా వ్రాసుకున్నారు డైరీలో

ఏం పాపం చేశానని నాకింత శిక్ష విధించారు? మీరు ఇంకా రాని రాత్రి సమయాల్లో మీ డైరీలు మీ ఉత్తరాలు చదువుతుంటే నా మనసు వెక్కెక్కి ఏడ్చేది

మీ మనసులో అలాంటి స్థానాన్ని పోగొట్టుకున్న ఈ జీవితం ఇంకెందు కనిపించేది — ఆవేశం వరద కన్నీళ్ళుగా ఆవిరైపోయాక మనసు స్థిమితపరచుకుని — సాధనతో స్థితప్రజ్ఞత సాధించాను

ఏ కారణంవల్లనైతేనేమి ఒకటిగా పెనవేసుకుపోగవలసిన మన మనసులు సమాంతర రేఖలుగా మారిపోయాయి

ఎంత దూరం ప్రయాణించినా మధ్య దూరం ఒకటేగదా !

అందుకే మీకు ఏ రకంగా ఇబ్బంది కలగకుండా నా లోకం నేను ఏర్పరచుకొన్నాను

తప్పంటారా ?

ఈ దూరం ఎలా తగ్గించాలో మీరే ఆలోచించండి ఎందుకంటే ఈ దూరం మీరే ఏర్పరచారు కాబట్టి

ఇంకో సంగతి చెప్పనా ?

మనిద్దరం ఇరవై రెండేళ్ళుగా ఒకరికొకరం తెలుసు

ఇరవై రెండేళ్ళ క్రిందట—అప్పటి మీ పట్ల నా మనసు ఎలాగుందో — ఇప్పుడూ — జుట్టు నెరిసినా సహజంగా, భౌతికంగా మారినా — నా మనసు మాత్రం అలాగే వుంది — ఇప్పటి రాజారావు పట్లగాదు — నా రౌడీ రాజారావ్ పట్ల అందుకే పరిష్కారాన్ని మీకే వదిలేస్తున్నాను

మీ

డివిత్ 'ఇ'

పి ఎస్ — ('ఇ' అంటే గుర్తుందా — మన కోడ్ వర్డ్ — ఎలిక్జర్ — అంటే అధరామృతం) ★